7

సాక్షి
జనగామ

గురువారం । 21 । నవంబర్ । 2024





తాళిబొట్టు చూపుతున్న పురోహితుడు, కల్యాణానికి హాజరైన భక్తజనం(ఇన్‌సెట్‌లో) ఉత్సవ మూర్తులు



తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు



కల్యాణం.. కమనీయం

వైభవంగా సీతారాముల కల్యాణం

● జీడికల్ వీరాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

లింగాలఘణపురం: జీడికల్ శ్రీ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఈ వేడుకను కనులారా తిలకించి పులకించి పోయారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ స్వామివారికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. వేదపండితులు గట్టు శ్రీనివాసాచార్యులు, విజయసారథి, రాఘవాచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో 31 మంది పుణ్య దంపతులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో అర్చకులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, రఘురామాచార్యులు, బుచ్చయ్యశర్మ పాల్గొనగా దేవస్థాన చైర్మన్ మూర్తి, స్థానిక ఈఓ వంశీతో పాటు డిప్యూటీ షన్‌పై లక్ష్మీప్రసన్న, డీపీఓ స్వరూప, ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్ అండాలు, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ శ్రీనివాసురెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, ఎన్‌సీసీ కేడెట్లు భక్తులకు సేవలందించారు. కల్యాణోత్సవ అనంతరం ఎంపీ కావ్య మాట్లాడుతూ మొదటిసారి జీడికల్ సీతారాముల కల్యాణం తిలకించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే రూ.5 లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశామని, వచ్చే ఏడాది లోగా గుట్టపై ఉన్న గుండాల వరకు మెట్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. శ్రీ రామచంద్రస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది మరింత వేడుకగా కల్యాణం జరిగేలా కృషి చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా ఆరుద్రోత్సవం



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం ఆరుద్రోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, ఆవు పాలతో అభిషేకం, గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నీరాజన పూజలు చేశారు. రాత్రి కార్తీక దీపోత్సవంలో మహిళలు దీపాలు వెలిగించారు. ఈఓ మోహన్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు డీవీఆర్.శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, నాగరాజు, సంతోష్, శ్యాం పాల్గొన్నారు.

శ్రీహరిణికి గోల్డ్‌మెడల్



కొడకండ్ల : స్థానిక టీజీఆర్ఎస్ జేసీ గురుకులంలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న బక్కెర శ్రీహరిణి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఇటీవల ములుగులో నిర్వహించిన ఉమ్మడి జిల్లా 68వ జోనల్ స్థాయి అండర్-17 కరాటే పోటీల్లో శ్రీహరిణి నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను బుధవారం ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

జనగామ రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22న దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు జూనియర్స్(10-17), సీనియర్స్(18-54) విభాగాల్లో జిల్లా స్థాయి ఆటల పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్న వారు పుట్టిన తేదీ నిర్ధారణకు ఎస్ఎస్‌సీ, సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అంధులకు రన్నింగ్, షాట్ పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షాట్ పుట్, క్యారం, శారీరక దివ్యాంగులకు వీల్‌చైర్/ట్రైసైకిల్, షాట్‌పుట్, క్యారం, మానసిక దివ్యాంగులకు షాట్‌పుట్, రన్నింగ్, క్యారం పోటీలు ఉంటాయని వివరించారు.


మినిమం టైం స్కేల్ మంజూరు చేయాలి..

జనగామ రూరల్: కేజీబీవీలు, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర శాఖ హైదరాబాద్‌లో బుధవారం నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి బయలుదేరిన ఉద్యోగుల వాహనాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనపరిచిన జిల్లాలోని దివ్యాంగులు అలాగే దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసిన వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డుల(2024)కు ఆసక్తి ఉన్న దివ్యాంగ వ్యక్తులు, అలాగే దివ్యాంగుల కొరకు పని చేస్తున్న వివిధ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఫ్లోరెన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ వ్యక్తిగత సామాజిక కార్యకర్త, రోల్ మోడల్, ఉత్తమ ఉద్యోగి, ఉత్తమ స్వయం ఉద్యోగి, ఉత్తమ క్రీడాకారుడు, పిల్లల వైకల్యంలో సృజనాత్మకత, పెద్దల వైకల్యంలో సృజనాత్మకత.. వీటన్నిటికీ ఒక పురుషుడు, ఒక మహిళ చొప్పున ఎంపిక చేస్తారు. అలాగే సంస్థాగత అవార్డుల్లో వికలాంగులజీవితాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో కూడిన ఉత్తమ అభివృద్ధి ఒకరికి, ఉత్తమ సంస్థ ఇద్దరికి, ఉత్తమ ఉద్యోగి ఒకరిని ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి డిసెంబర్ 3న హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానం ఉంటుందని, ఈనెల 29 లోపు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రాల పరిశీలన



జనగామ: గ్రూప్-4 పరీక్షలో అర్హత సాధించిన 54 మందిని ప్రభుత్వం జిల్లాకు కేటాయించినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా బుధవారం వెల్లడించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఈఓ. రాము, ఇతర అధికారుల సమక్షంలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 50 మంది ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకాగా.. మిగతా నలుగురు గురువారం(నేడు) చివరి తేదీగా గమనించి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

● రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

పాలకుర్తి టౌన్: సహజ కవి బమ్మెర పోతన జన్మస్థలాన్ని ఆధ్యాత్మిక సాహితీ కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం బమ్మెరలోని పోతన స్మృతి వనం, అభివృద్ధి పనులను ఆయన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. పోతన సమాధి, పోతన వ్యవసాయ క్షేత్రం, బావిని పరిశీలించాక ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తి, బమ్మెర, వల్మిడిని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అసంపూర్తిగా ఉన్న పోతన పర్యాటక ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోతన సమాధి, వ్యవసాయ బావి సమీప వాగుపై చెక్ డ్యాం.. అలాగే పర్యాటకులకు హరిత హోటల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి ఆరు నెలల్లో పోతన స్మృతి వనాన్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



పోతన సమాధి వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా

ఏ ఎండకు ఆ గొడుగు.. ఎర్రబెల్లి నైజం

ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నైజం ఎర్రబెల్లి దయాకర్‌రావుది.. ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో పదవులు పట్టుకొని పాకులాడిన చరిత్ర దయాకర్‌రావుది అని అన్నారు. ఇక్కడ సరైన ప్రత్యర్థి లేక ఇన్ని రోజులు ఆయన ఆటలు సాగాయని, ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఎర్రబెల్లిని ఓడించి సరైన తీర్పు నిచ్చారని పేర్కొన్నారు.

ఒక్క క్లిక్.. సమగ్ర సమాచారం

పాఠశాలల అభివృద్ధికి 'యూ డైస్ ప్లస్'

● దీని ఆధారంగా నిధుల కేటాయింపు
● జిల్లాలో 662 ప్రభుత్వ పాఠశాలలు



జనగామ రూరల్: విద్యా వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకేచోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు యూ డైస్ ప్లస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) వెబ్‌సైట్ రూపొందించింది. ఇక నుంచి ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ పాఠశాలల సమగ్ర సమాచారం వెబ్‌సైట్‌లో ప్రత్యక్షం కానున్నది. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారంతో పాటు మౌలిక వసతులు ఏ పాఠశాలలో ఎలా ఉన్నాయి.. ఎంతమంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారనే విషయాలు యూ డైస్ ప్లస్ ద్వారా స్పష్టంగా తెలియనుంది.

యూడైస్ నుంచి యూడైస్ ప్లస్

2021-22 వరకు యూడైస్‌గా కొనసాగిన ఈ వ్యవస్థను.. ఆ తర్వాత యూ డైస్ ప్లస్‌గా ఆధునికీకరించారు. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్డేట్ చేయగా.. ఇకపై మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్డేట్ చేసే అవకాశం ఉంది. వెబ్‌సైట్‌ను పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యూల్స్ అనే మూడు భాగాలుగా విభజించి సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యాన ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. పాఠశాలల స్థితిగతులు అంశాల వారీగా వివరాలను వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేస్తున్నారు.

మొత్తం సమాచారం నిక్షిప్తం..

జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతీ విద్యార్థి వివరాలు వెబ్‌సైట్‌లో పొందు పరుస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు ఉండగా.. ప్రస్తుత సమాచారంతో అప్డేట్ చేస్తున్నారు. అలాగే పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీరు తదితర సదుపాయాల వివరాలు, వాటి స్థితిగతులపై తాజా సమాచారాన్ని పొందుపరుస్తున్నారు.



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

అక్రమాలకు చెక్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సర్కారు పరంగా అందుతున్న వసతుల కల్పనకు యూడైస్ ప్లస్‌లోని వివరాలు కీలకం కానున్నాయి. అవినీతికి పాల్పడకుండా ఈ విధానం ఉపయోగపడనున్నది. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థులకే ఇకపై యూనిఫాం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర వాటిని అందించనున్నారు. అలాగే వసతుల కల్పనకు ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు కానున్నాయి.

ప్రతీ విద్యార్థికి నంబర్ కేటాయింపు

యూ డైస్ ప్లస్ పోర్టల్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యాన నడుస్తుంది. ప్రతి ఏడాది అన్ని పాఠశాలల్లో సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులోని ప్రతీ విద్యార్థికి ఒక పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్(పీఈఎన్) కేటా కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశవ్యాప్తంగా ఏఏ పాఠశాలల్లో ఏఏ తరగతులు చదివాడనేది కచ్చితంగా తెలుస్తుంది. పదో తరగతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాయాలంటే ఇందులో నమోదై ఉండాల్సిందే.

జిల్లాలో అన్ని యజమాన్యాల కింద 662 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 75,070 మంది విద్యార్థులు ఉన్నారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
బచ్చన్నపేట	52	4,860
చిల్పూర్	42	2,906
దేవరుప్పుల	60	4,542
స్టేషన్‌ఘన్‌పూర్	59	10,534
జనగామ	112	24,288
కొడకండ్ల	42	3,548
లింగాలఘణపురం	38	3,403
నర్మెట	40	3,762
పాలకుర్తి	82	7,693
రఘునాథపల్లి	69	4,522
తరిగొప్పుల	24	1,179
జఫర్‌గఢ్	42	3,833

నమోదు ప్రక్రియ కొనసాగుతోంది..



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్ డేట్ చేసే అవకాశం ఉండేది. ఇకపై మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్డేట్ చేస్తారు. అలాగే.. యూ డైస్ ప్లస్‌లోని సమాచారం ఆధారంగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించే అవకాశం ఉంది. ఈనెల చివరి నాటికి ప్రక్రియ పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం.

- రాము, జిల్లా విద్యాధికారి

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

● సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఈ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ, హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రంలోకి ప్రవేశించే యశ్వంతాపూర్, పెంబర్తి జంక్షన్ల(టర్నింగ్ పాయింట్)లో స్పీడ్ బ్రేకర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, అలాగే రఘునాథపల్లి ఫ్లై ఓవర్ ఏరియాలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. జిల్లా పరిధి ఎన్‌హెచ్ రహదారి పొడవునా, అప్రోచ్‌రోడ్లు, బస్టాప్‌లున్న చోట వాహన డ్రైవర్లకు అర్థమయ్యేలా సైన్ బోర్డులు, లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ఇబ్బంది లేకుండా జీబ్రా క్రాసింగ్, రోడ్డుపై రిఫ్లెక్టింగ్ లైటింగ్ ఉండేలా చూడాలని ఆదేశించారు. నాలుగు చక్రాల వాహన డ్రైవర్లు సీటు బెల్ట్, ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపినా, మైనర్లకు వాహనం ఇచ్చినా చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. సమీక్షలో ఏసీపీ పార్థసారథి, ఆర్ అండ్‌బీ ఎస్ఈ పి.సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టీజీఎస్పీడీసీఎల్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్టీసీ డీఎం స్వాతి, 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సర్వే వివరాల నమోదులో తప్పులుండొద్దు

సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో తప్పులు లేకుండా చూడాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఆన్‌లైన్ నమోదుపై మాస్టర్ ట్రెయినర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సర్వేలో సేకరించిన వివరాల నమోదును ఈ నెల 22 నుంచి ప్రారంభించాలన్నారు. జిల్లా మాస్టర్ ట్రెయినర్లు మండల స్థాయిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు.

రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయ సేకరణ

స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై బహిరంగ విచారణకు నేడు(గురువారం) అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు జిల్లాలోని బీసీ, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజలు తమ అభిప్రాయాలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను హనుమకొండ కలెక్టరేట్‌లో డెడికేషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు తదితరులకు అందజేయాలని కోరారు.

విద్యపై ఆసక్తి పెంచుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: బాల్యం నుంచి విద్యపై ఆసక్తి పెంచుకోవాలి.. అప్పుడే జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సం సందర్భంగా బుధవారం పట్టణంలోని తెలంగాణ బాలుర సోషల్ వెల్ఫేర్ స్కూల్, జూనియర్ కళాశాల డీఎల్ఎస్ఏ, డీసీపీయూ, చైల్డ్‌లైన్, స్కోప్ ఎన్జీఓ సంయుక్త ఆధ్వర్యాన బాలల హక్కులు, చట్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులు బాలల హక్కులు, బాధ్యతలను తెలుకోవడంతోపాటు యువత చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారి రవికాంత్ ప్రసంగించారు. ఎవరైనా బాలలు ఆపదలో ఉంటే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రవికుమార్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్, ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

దళితుల అభ్యున్నతికి సీఎం కృషి

● ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్

జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి దళితుల అభ్యున్నతికి పాటు పడుతున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఆర్టీసీ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 13, 16, 30 వార్డుల్లో ఎన్జీఓ గీతాచార్య ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ తరగతుల సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రీతమ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి నినాదంతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక వారిని నట్టేట ముంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలు సమస్యలపై జనగామ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు గంధమాల మల్లేష్, తిప్పారపు ప్రసాద్, గంగారపు కిషన్.. చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి మల్లారెడ్డి, కౌన్సిలర్లు మల్లిగారి చంద్రకళ రాజు, గాదెపాక రామచందర్, బొట్ల శ్రీనివాస్, పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజమౌళి, బొట్ల నర్సింగరావు, గణిపాక మహేందర్, మిద్దెపాక స్టాలిన్, గాదెపాక ప్రసాద్, ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ మిద్దెపాక సిద్ధులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ ఇస్తున్న ప్రీతమ్

తెలంగాణ అభివృద్ధి ప్రదాత మోదీ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి

జనగామ రూరల్: తెలంగాణ అభివృద్ధి ప్రదాత ప్రధాని మోదీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆదరించడాన్ని ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాకతీయుల గడ్డ ఓరుగల్లుకు స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ పథకాలు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కాజీపేట వ్యాగన్ పరిశ్రమ, రామప్పకు యూనిస్కో, గిరిజన యూనివర్సిటీ.. ఇవన్నీ ఇచ్చిన మోదీ కాళ్లు కడిగి నీళ్లు తలపై చల్లుకోవాలన్నారు. పేదల ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సౌడ రమేష్, దుబ్బ రాజశేఖర్‌గౌడ్, సభ్యత్వ ప్రముఖ్ కొంతం శ్రీనివాస్, సీనియర్ నాయకులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దశమంతరెడ్డి

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ రూరల్: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు 22న ధర్మకంచలోని మినీస్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన 8, 10, 12 ఏళ్ల బాల బాలికలు డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు నేడు (గురువారం) ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు గంగిశెట్టి మనోజ్ కుమార్(9885046437), ఆవుల అశోక్(9912453220), వంచ చంద్రశేఖర్‌రెడ్డి(7799552233)ని సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

జనగామ రూరల్: దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. పింఛన్ పెంచుతామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విస్మరించిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఈనెల 26న ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. దీక్షలో చిరంజీవి, రాజశేఖర్, నర్సయ్య, గడ్డం సందీప్, రవి, ప్రశాంత్, వెంకటేశ్వర్లు, వంశీ, సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చీటర్, బ్రోకర్..



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, పక్కన శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

- అబద్ధాలు, మోసపూరిత మాటలతో అధికారంలోకి..
- సీఎం హోదాలో ఏమి మాట్లాడుతున్నావో సోయి ఉందా?
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హన్మకొండ: సీఎం రేవంత్ రెడ్డివి చిల్లర మాటలని, ఆయనొక చీటర్, బ్రోకర్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తూర్పారబట్టారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ అనే మొక్కను మొలవనివ్వవా.. గంజాయి మొక్కలాంటి నిన్ను పీకి అవతల పారేస్తామన్నారు. అబద్ధాలు, మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చి సీఎం అయ్యావన్నారు. 'నన్ను రాక్షసుడన్నావు.. అవును నేను రాక్షసుడినే. పని చేసే రాక్షసుడిని.. నా ప్రజల కోసం ఏమైనా చేస్తా' అని అన్నారు. నీ మాటలు నమ్మి ఓటేసిన ప్రతీ ఒక్కరిని మోసం చేశావన్నారు. సీఎం హోదాలో ఏమీ మాట్లాడుతున్నావో సోయి ఉందా అని ప్రశ్నించారు. విజయోత్సవ సభలు పెట్టుకోవడం కాదు.. నమ్మి ఓటేసిన ప్రజల సమస్యలు పట్టించుకో అని హితవు పలికారు. నాడు సోనియాను బలిదేవత అని, నేడు దేవత అని ఆమె కాళ్లు కడిగి నీళ్లు చల్లుకుంటానని మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ వల్లే కాళోజీ కళాక్షేత్రం అద్భుతంగా నిర్మితమైందన్నారు. శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ఇందిర మహిళా శక్తి విజయోత్సవ సభ వంచన సభ అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ దుర్మార్గంగా మాట్లాడారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ముఖ్యమంత్రి 5 ఏళ్లు కొనసాగలేదని, రేవంత్ రెడ్డికి కౌంట్ డౌన్ ప్రారంభమైందన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విజయోత్సవ సభలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేస్తున్నట్లు ప్రకటిస్తారని ఆశించిన వారికి భంగం కలిగిందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి, అతడి అనుచరులు చిల్లర మాటలు బంద్ చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్ మాట్లాడారు. సమావేశంలో గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఆ.. మాటలు సీఎం పదవికే అవమానం

- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించే అర్హత రేవంత్‌కు లేదు
- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



మాట్లాడుతున్న బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, పక్కన నేతలు మార్తినేని, గంట

హన్మకొండ: రేవంత్ రెడ్డి మాటలు సీఎం హోదాకే అవమానకరమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని విమర్శించే అర్హత సీఎం రేవంత్ రెడ్డికి లేదన్నారు. ఇరువురిపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాల్లో గెలుస్తామని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు బీజేపీని 8 స్థానాల్లో గెలిపించారన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు 8 స్థానాలు మాత్రమే వచ్చాయన్నారు. కాజీపేటకు వ్యాగన్ పరిశ్రమ మంజూరు చేసి ఇప్పుడు దీనిని కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాజీపేటకు ఇచ్చిన కోచ్ ఫ్యాక్టరీని తరలించుకుపోయిందని విమర్శించారు. వరంగల్ మహానగర అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీని తెలంగాణ ద్రోహి అంటే నాలుక చీరుస్తామన్నారు. కిషన్ రెడ్డిని గుజరాత్‌కు వెళ్లు అంటున్న రేవంత్.. మీరు ఇటలీకి పోతారా అని ప్రశ్నించారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ కాకతీయుల గడ్డ ఓరుగల్లుకు స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ పథకాలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇచ్చిన ఘనత ప్రధాని మోదీది అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించడం చూసి ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి భాష మార్చుకో అని హితువు పలికారు. నోటి దురుసు మంచిది కాదన్నారు. సమావేశంలో నాయకులు డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, గుజ్జ సత్యనారాయణ రావు, కొలను సంతోశ్ రెడ్డి, జయంత్ లాల్, కొండి జితేందర్ రెడ్డి, జనగామ శ్రీనివాస్, చల్ల జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే తరిమికొడతారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పక్కన ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- ఉమ్మడి జిల్లాకు వేల కోట్ల నిధులు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: 'ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రూ. వేల కోట్ల నిధులు మంజూరు చేస్తే ఏం తెచ్చారని కొందరు అజ్ఞానులు అడుగుతున్నారు.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ద్రోహులను ప్రజలే తరిమికొట్టే రోజులొస్తాయి' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయోత్సవసభతో ఉమ్మడి వరంగల్ జిల్లా కొత్త రూపం దాల్చబోతుందన్నారు. గత ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులుంటే రూ.200 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పనులకు టెండర్లను పిలిస్తే కమీషన్లకు కక్కుర్తి పడే నాయకుల తీరుతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. అది మరిచిన కొందరు మీడియా సమావేశం పెట్టి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చదువుకున్న అజ్ఞాని అన్నారు. జీఓలను చదివే కనీస జ్ఞానం లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తమ జీవిత కాలంలో తీసుకురాలేనన్ని నిధులు ప్రజాప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లతో సరిపెడితే కాంగ్రెస్ సర్కారు పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించిందన్నారు. నాడు సీఎం రేవంత్ ఇచ్చిన హామీ ప్రకారం ఎయిర్‌పోర్టు భూసేకరణ, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. పదేళ్లు భూకబ్జాలతో నగరాన్ని భ్రష్టుపట్టించిన దొంగలు నేడు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, విజయశ్రీరజాలి, నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

పలిమెల : ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సర్వాయిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై తమాషారెడ్డి కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన ఆకుదారి ప్రశాంత్ (17) మిత్రులతో కలిసి మంగళవారం గోదావరి నదిలోకి ఈతకు వెళ్లాడు. అయితే ప్రశాంత్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ఎంతకూ పైకి తేలలేదు. దీంతో మిత్రులు.. ప్రశాంత్ గల్లంతైన విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహదేవ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్

డోర్నకల్: డోర్నకల్ మీదుగా విజయవాడ వైపునకు వెళ్తున్న గూడ్స్ రైలులో సాంకేతిక లోపం తలెత్తి మెయిన్ లైన్‌లో నిలిచింది. దీంతో బుధవారం పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గూడ్స్ డోర్నకల్ నుంచి బయలుదేరి పాపటపల్లి స్టేషన్ సమీపిస్తుండగా రైలులో సాంకేతిక సమస్య తలెత్తి మెయిన్‌లైన్‌లో నిలిచింది. దీంతో డోర్నకల్ నుంచి విజయవాడకు వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ బుగ్గవాగు సమీపంలో, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ డోర్నకల్ స్టేషన్‌లో నిలిచాయి. మరో ఇంజిన్‌ను పంపి మెయిన్‌లైన్‌లో నిలిచిన గూడ్స్‌ను పాపటపల్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సుమారు 1.20 గంటల పాటు నిలిచిన కృష్ణా ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో అరగంట నిలిచిన ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఖమ్మం వైపునకు పంపారు.

లక్నవరం.. పర్యాటకుల స్వర్గధామం



మూడో ద్వీపంలోని 'ద కావ్ ఫ్రీ కోట్స్' రిసార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు



రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్ ఎదుట మంత్రులు జూపల్లి, సీతక్క

- అందుబాటులోకి మూడో ద్వీపం
- రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క

గోవిందరావుపేట : లక్నవరం.. పర్యాటకుల స్వర్గధామమని, రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామం లక్నవరం జలాశయంలో రూ. 7 కోట్ల వ్యయంతో మూడు ఎకరాల విస్తీర్ణంలో టీజీటీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మూడో ద్వీపాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు ఉండడంతోపాటు దేశంలోని అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క–సారక్క జాతర ములుగు జిల్లాకు గుర్తింపు తెచ్చిపెడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దుతామని, పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తామన్నారు. ఐలాండ్ అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి సుందర ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తెలంగాణలో కూడా అలాంటి టూరిజం స్పాట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కనుచూపు మేర నీరు.. చుట్టూ పచ్చని కొండల మధ్యలో 12 దీవులతో ప్రకృతి అందాలను కలబోసుకున్న లక్నవరానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కేంద్రం ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో పర్యాటక ప్రాంతాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ సమావేశాల్లో పర్యాటక ప్రాంతాలకు నిధులు కేటాయించాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు మరో అవకాశం..

- 9,11వ తరగతుల్లో ఖాళీలు
- ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తులకు ఆహ్వానం



మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం

ఖిలా వరంగల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వరంగల్ మామునూరులో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేసింది. ఇందులో ఏటా 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేస్తూ ప్రవేశాలు స్వీకరిస్తోంది. అయితే ప్రస్తుతం 2025–26 సంవత్సరానికి సంబంధించి 9,11వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించింది. ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ ఉండాలి. 11వ తరగతిలో ప్రవేశాలకు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న వారే దరఖాస్తు చేసుకోవాలి. 9వ తరగతిలో ప్రవేశాలకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మే 1, 2010 నుంచి జూలై 31, 2012 మధ్య జన్మించిన వారు, 11వ తరగతిలో ప్రవేశాలకు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు జూన్ 1, 2008 నుంచి జూలై 31, 2010 మధ్య జన్మించి ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు నవంబర్ 26వ తేదీలోపు httpr:llcbreitmr.nic.in2024nvrix వెబ్ సైట్, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 08, 2025న జరగనుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



నవోదయలో ప్రవేశాల కోసం విద్యార్థులకు మరో అవకాశం కల్పించాం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రణాళికాప్రకారం పరీక్షకు సన్నద్ధమై ఉత్తీర్ణత సాధించాలి.

– బి.పూర్ణిమ, నవోదయ ప్రిన్సిపాల్, మామునూరు

లైబ్రేరియన్‌పై దాడి.. యువకుడి అరెస్ట్

- 10 గ్రాముల బంగారు ఆభరణం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పార్థసారథి



మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

జనగామ: జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ భూక్యా ఉపేందర్‌పై దాడి చేసి బంగారు చైన్ ఎత్తుకెళ్లిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పార్థసారథి తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్‌తో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా బక్కరుప్పుల తండాకు చెందిన కేలోత్ సాయికృష్ణ గత నెల14వ తేదీన ఏదైనా ఉద్యోగం చేయడానికి జనగామ జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న సమయంలో అడ్మిషన్ లేకుండా ఇక్కడ ఉండొద్దని హాస్టల్ వార్డెన్ పంపించాడు. దీంతో పీజీ అడ్మిషన్ కోసం ఈ నెల4వ తేదీన ఏబీవీ డిగ్రీ కళాశాలకు వెళ్లాడు. ఆ సమయంలో లైబ్రరీ అనారోగ్యంగా ఉన్నట్లు గుర్తించాడు. ఈ క్రమంలో చోరీ చేస్తే సులువుగా డబ్బులు సంపాదించొచ్చనే ఆలోచనతో ఈ నెల5వ తేదీన డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ రాగానే అతడిపై దాడికి పాల్పడి మెడలో ఉన్న 10 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనపై సీఐ దామోదర్ రెడ్డి, ఎస్సై భరత్, సిబ్బంది విశ్వసనీయ సమాచారం మేరకు బాలాజీనగర్‌లోని విజయ లాడ్జిలో ఉన్న సాయికృష్ణను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం అంగీకరించగా రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పార్థసారథి తెలిపారు.

దొంగలను పట్టుకుని బంగారం రికవరీ చేస్తాం



బ్యాంకు వద్దకు చేరుకున్న బంగారం దాచుకున్న బాధితులు





ఎస్‌బీఐ వద్దకు చేరుకుంటున్న సీపీ, గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన బ్యాంకు లాకర్

- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా
- చోరీకి పాల్పడింది ప్రొఫెషనల్ గ్యాంగే..
- బ్యాంకు ఎదుట ఖాతాదారుల ఆందోళన

రాయపర్తి : త్వరలోనే దొంగలను పట్టుకుని బంగారాన్ని రికవరీ చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఘటనా స్థలికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా బ్యాంకుపై భరోసాతో లాకర్లలో దాచుకున్న తమ బంగారాన్ని దొంగలు దోచుకువెళ్లడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి నుంచి 19 తేదీ తెల్లవారు జామున దొంగలు వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్‌బీఐ భవనం కిటికీని తొలగించి లోపలికి చొరబడిన 19కిలోల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన విదితమే. ఈ సందర్భంగా డీసీపీలు రాజమహేంద్రనాయక్, షేక్ సలీమా, ఏసీపీ నర్సయ్యతో కలిసి సీపీ ఘటనా స్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన విషయంపై అధికారులతో చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఎస్‌బీఐ లాకర్‌లోని 19 కిలోల బంగారు ఆభరణాలను గ్యాస్ కట్టర్ సాయంతో కోసి చోరీకి పాల్పడింది వాస్తవమేనన్నారు. ఇది ప్రొఫెషనల్ గ్యాంగ్ పనే అని తెలిపారు. క్లూస్ టీంతో అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు శ్రవణ్‌కుమార్, రామ్‌చరణ్, రాజు తదితరులు ఉన్నారు.

అధికారులు ఏం చెప్పడం లేదు

మాది రాయపర్తి మండలకేంద్రం. 13తులాల బంగారాన్ని ఎస్‌బీఐలో తనఖా పెట్టి రూ.4.10లక్షల అప్పు తీసుకున్నా. తీరా బంగారం దొంగలు ఎత్తుకెళ్లారని తెలిసి బాధగా ఉంది. బ్యాంకుకు వచ్చి అడుగుదామనుకుంటే అధికారులు ఏం చెప్పడంలేదు. మా బంగారాన్ని మాకు ఇప్పించాలి.

– ఎండీ మన్నన్, రాయపర్తి

బ్యాంకు అధికారులు సమాధానం చెప్పడం లేదు

ఎస్‌బీఐపై నమ్మకంతో బంగారు ఆభరణాలను లాకర్‌లలో దాచుకున్నామని, బ్యాంకు పక్కన ఇళ్లు లేకపోవడంతోపాటు సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని ఖాతాదారులు ఆరోపించారు. ఇప్పటి వరకు బ్యాంకు అధికారులు తమకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చివరన బ్యాంకు ఏర్పాటు చేయడం.. పక్కన జనావాసాలు లేకపోవడం దొంగలకు ఆవాసంగా మారిందన్నారు. బ్యాంకు పక్కన ముళ్లచెట్లు ఏపుగా పెరిగి నిర్మానుష్య ప్రదేశం ఉండడం వల్లే చోరీ జరిగిందన్నారు. నిర్లక్ష్యం వహించిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

కాజీపేట మీదుగా శబరిమలకు స్పెషల్ రైళ్లు..

- మౌలాలి–కొల్లం మధ్య 12 సర్వీసులు
- రేపటి నుంచి ప్రారంభం..

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా కేరళలోని శబరిమలకు వెళ్లే అయ్యప్ప మాలధారులు, భక్తుల సౌకర్యార్థం మౌలాలి –కొల్లం మధ్య ప్రత్యేక రైళ్ల సర్వీసులు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సర్వీసుల వివరాలు..

మౌలాలి–కొల్లం ప్రత్యేక రైలు: ఈనెల 22, 29, డిసెంబర్ 6,13,20,27వ తేదీల్లో మౌలాలి–కొల్లం (07143) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం మౌలాలిలో 11.30 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 13.28 గంటలకు చేరుకుంటుంది. కొల్లంకు శనివారం రాత్రి 7.00 గంటలకు చేరుతుంది.

కొల్లం–మౌలాలి: కొల్లం–మౌలాలి (07144) ఎక్స్‌ప్రెస్ ఈనెల 24, డిసెంబర్ 1,8, 15, 22, 29వ తేదీల్లో కొల్లంలో ఆదివారం తెల్లవారుజామున 02.30 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 06.03 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 10.00 గంటలకు మౌలాలికి చేరుతుంది.

హాల్టింగ్ స్టేషన్లు..

చర్లపల్లి, భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట, కట్‌పడి జంక్షన్, జోలర్‌పెట్టి, సెలం జంక్షన్, ఈరోడ్ జంక్షన్, తిరుప్పూర్, కోయంబత్తూరు జంక్షన్, పాల్క్కడ్ జంక్షన్, త్రిషుర్, అలువ, ఎర్నాకులం టౌన్, ఇట్టుమనూర్, కొట్టాయం, చెంగనసెర్రిచ తిరువల్ల, చెంగనూర్, కాయన్‌కులం జంక్షన్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.

కేటీఆర్ ధర్నాను అడ్డుకుంటాం..

- ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర
- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్ రూరల్ : బీఆర్‌ఎస్ హయాంలో గిరిజనుల నుంచి బలవంతంగా లాక్కున్న భూములను వారికి తిరిగి ఇచ్చిన తర్వాతే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి రావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లగచర్ల ఘటన వెనుక బీఆర్‌ఎస్ కుట్ర ఉందన్నారు. ఖబడ్దార్ కేటీఆర్.. మానుకోటలో ధర్నా ఎలా చేస్తారో చూద్దాం, ఇక్కడి నుంచి తరిమికొడుతామన్నారు. మానుకోటలో అభివృద్ధి పేరిట గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను లాక్కున్నారని, పరిహారంకూడా ఇవ్వలేదన్నారు. మెడికల్ కళాశాల భూముల విషయంలో పోరాడినందుకు వార్డు కౌన్సిలర్ బానోత్ రవిని హత్య చేయించారన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ భూ కబ్జాలు చేసిన సమయంలో కేటీఆర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఎటుపోయారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలు కబ్జాలు చేసిన ప్రభుత్వ భూములన్నీ ప్రభుత్వ పరం చేస్తామన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మృతిచెందిన వార్డు కౌన్సిలర్ బానోత్ రవినాయక్ భార్య పూజ మాట్లాడుతూ మెడికల్ కళాశాల భూముల విషయంలో తన భర్తను మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ చంపించాడని, నాడే రెండు రూ. కోట్లు, కారు ఇస్తామని చెప్పారన్నారు. సమావేశంలో అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కేసముద్రం, మానుకోట ఏఎంసీల చైర్మన్లు ఘంట సంజీవరెడ్డి, ఇస్లావత్ సుధాకర్, ఎండీ.ఖలీల్, అంబటి వీరభద్రం, బండి శ్రీను, గునిగంటి కమలాకర్, నీరుటి లక్ష్మీనారాయణ, చిట్టెం వెంకన్న, ఎదల్ల యాదవరెడ్డి, శంతన్ రామరాజు, గుగులోత్ రాములునాయక్, అరెందుల వెంకటేశ్వర్లు, గుగులోత్ వెంకట్, భూక్య విజయ, చలమల్ల నారాయణ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు శ్రీను, హరిసింగ్, విజయమ్మ, జగన్, తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల బాధితులకు న్యాయం జరగాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: లగచర్ల బాధితులకు న్యాయం జరగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లగచర్ల ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని, బాధితులకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తామన్నారు. లగచర్ల గిరిజన రైతులను ఇబ్బందిపెట్టి 28 మందిని అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను మొలక అని సీఎం మాట్లాడడం సరికాదన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు కేసీఆర్ చరిత్ర ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ ఈనెల 21న స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మాట్లాడుతూ ఫార్మా కంపెనీ పేరుతో గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడారు. మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు, నాయకులు భరత్‌కుమార్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి, రవికుమార్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఎడ్ల వేణుమాధవ్, కన్నా, జె. వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.